## వర్ధాపురంలో సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభం

### రిబ్బన్ కట్ చేసిన ఉపసర్పంచ్ పల్లె కాశయ్య



**మఠంపల్లి, డైనమిక్ న్యూస్** మఠంపల్లి మండలం వర్ధాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఉపసర్పంచ్ పల్లె కాశయ్య, ప్రధానోపాధ్యాయులు మామిడి వెంకటేశ్వర్లు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ పల్లె కాశయ్య మాట్లాడుతూ గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తించి శిక్షణ, ప్రోత్సాహం అందించనున్నట్లు చెప్పారు. సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వ్యాయామ ఉపాధ్యాయులు మామిడి వీరస్వామి తెలిపారు. వాలీబాల్, కబడ్డీ క్రీడలకు మొదటి, రెండవ బహుమతులుగా ట్రోఫీలు, మెడల్స్ అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు భిక్షం, రాజశేఖర్ రెడ్డి, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 6 కేజీల గంజాయి స్వాధీనం ఆరుగురు అరెస్ట్



**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారంతో ఎస్సై మోహన్‌బాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి 6 కేజీల గంజాయి, ఒక బైక్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితుడు వీరమల్ల ఉపేందర్ హైదరాబాద్‌లో తన బైక్‌ను అమ్మి వచ్చిన డబ్బులతో ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి, కాస జయంత్‌తో కలిసి హుజూర్‌నగర్‌కు తీసుకొచ్చి విక్రయానికి ప్రయత్నించినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన వారంతా హుజూర్‌నగర్‌కు చెందినవారేనని, వారిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్సైలు మోహన్‌బాబు, నరేష్, ఏఎస్ఐ బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలే బీఆర్ఎస్ ప్రచార అస్త్రం

**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 6,7 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి బుధవారం ప్రారంభించారు. ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించిందని, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధే వాడవాడలో కనిపిస్తోందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చినట్లే మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి షాక్ ఇవ్వబోతున్నారని చెప్పారు. హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన






**డైనమిక్ న్యూస్, నేరేడు చర్ల** నేరేడు చర్ల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రంలో ఏర్పాట్లు, భద్రతా చర్యలను బుధవారం హుజూర్ నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, తహశీల్దార్ సురీగి సైదులు,సీఐ చరమంద రాజు, స్థానిక ఎస్ఐ రవీందర్ కలిసి కేంద్రాన్ని తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆర్డీఓ సూచించారు. అభ్యర్థులు, ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లను పటిష్ఠంగా కొనసాగిస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు

## ఎన్నికల నియమావళి పటిష్టంగా అమలు ఎస్పీ నరసింహ




**సూర్యాపేట బ్యూరో, డైనమిక్ న్యూస్** మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నామినేషన్ కేంద్రాలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయని, 144 సెక్షన్ అమలులో ఉందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో బారికేడింగ్ ఏర్పాటు చేసి గుంపులుగా చేరవద్దని సూచించారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో చెక్‌పోస్టులు, తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి రూ.50 వేలకుపైగా నగదు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. సమస్యలు సృష్టించే వ్యక్తులపై ముందస్తు బైండోవర్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎమ్మార్వో కృష్ణయ్య, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## నల్లగొండ నామినేషన్ కేంద్రాల పరిశీలన చేసిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్




**నల్లగొండ బ్యూరో, డైనమిక్ న్యూస్** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు2026 నేపథ్యంలో నల్లగొండ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ బుధవారం పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా ప్రవేశనిష్క్రమణ మార్గాలు, క్యూలైన్లు, పోలీస్ బందొబస్త్, ట్రాఫిక్ నిర్వహణను ఆయన తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీసీటీవీ నిఘా, ప్రత్యేక గస్తీతో పాటు అవసరమైనప్పుడు డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, ఎస్‌బీ సీఐ రాము, 2 టౌన్ ఎస్ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా, శాంతియుతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు జోనల్ అధికారులదే కీలక పాత్ర

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**డైనమిక్ న్యూస్, సూర్యాపేట బ్యూరో** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో జోనల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జోనల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వ్యయ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల ఏర్పాట్లపై నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకం, ఓటర్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఉల్లంఘనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డబ్బు, మద్యం, బహుమతుల అక్రమ పంపిణీని అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ సమన్వయంతో పనిచేయాలని, చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు ఖర్చు పరిమితిని తప్పనిసరిగా పాటించేలా వ్యయ పరిశీలకులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, వ్యయ పరిశీలకుల నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్, మాస్టర్ ట్రైనర్ రమేష్, జోనల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు సమన్వయంతో ఎన్నికలు విజయవంతం చేయాలి



**నల్గొండ బ్యూరో, డైనమిక్ న్యూస్** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నోడల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అధికారి తమ అంశానికి సంబంధించిన విధులను నిర్లక్ష్యం లేకుండా నిర్వహించాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలని, మున్సిపాలిటీ స్థాయిలో నియమించిన నోడల్ అధికారులతో జిల్లా స్థాయి అధికారులు సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వబోమని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, వై. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో త్రాగునీటి సమస్యల నివారణకు ప్రత్యేక డ్రైవ్

### ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**డైనమిక్ న్యూస్, సూర్యాపేట బ్యూరో** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 1 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నీటి సరఫరా డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, గ్రామాల వారీగా బోర్లు, హ్యాండ్‌పంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, పనిచేయని మోటార్లు, లీకేజీలు, బ్రేక్‌డౌన్లను వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులకు శుభ్రత, క్లోరినేషన్ తప్పనిసరి చేయాలని చెప్పారు. అలాగే జల సేవల స్థితిగతులను విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ ద్వారా గుర్తించి జేజేఎం డాష్‌బోర్డ్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జడ్పీ సీఈవో శిరీష, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి: కలెక్టర్ చంద్రశేఖర్

**డైనమిక్ న్యూస్, నల్గొండ బ్యూరో** మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలోని మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ, హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీలు మరియు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు నామినేషన్లు, 31న పరిశీలన, ఫిబ్రవరి 3న ఉపసంహరణ, ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు. జిల్లాలో మొత్తం 3,09,097 మంది ఓటర్లు, 162 వార్డులు, 475 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని, బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ జరుగుతుందని వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందని, ప్రచార నియమాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని అన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను హతమార్చిన భార్య





**డైనమిక్ న్యూస్ మాడుగులపల్లి** మండలంలోని సీత్యాతండా గ్రామంలో వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను భార్య అతికిరాతకంగా హతమార్చిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం, సీత్యాతండాకు చెందిన రామావత్ రవి వేములపల్లి మండలం సల్కునూరు గ్రామంలోని పిఏసిఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉండేవాడు. భార్య లక్ష్మి వ్యవహార శైలిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇటీవల తరచూ దంపతుల మధ్య గొడవలు జరుగుతుండేవి. భర్త అడ్డుగా నిలుస్తున్నాడని భావించిన భార్య లక్ష్మి తన ప్రియుడితో కలిసి పన్నాగం పన్ని రవిని హతమార్చినట్లు సమాచారం. అనంతరం పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కాంగ్రెస్ సంక్షేమ పథకాలే నా గెలుపుకు ఆధారం విజయ వెంకటేశ్వర్లు



**డైనమిక్ న్యూస్, హుజూర్‌నగర్** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే తన గెలుపుకు బలంగా నిలుస్తాయని 16వ వార్డు మాజీ కౌన్సిలర్ కారింగుల విజయ వెంకటేశ్వర్లు అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా మాట్లాడిన ఆమె, మళ్లీ 16వ వార్డు నుంచి పోటీ చేసేందుకు సిద్ధమని తెలిపారు. మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశీస్సులు, సహకారంతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయంగా సేవలందించానని పేర్కొంటూ, మరోసారి హస్తం గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

## సోనా బేకరీ & స్వీట్స్ నూతన బ్రాంచ్ ప్రారంభం




**డైనమిక్ న్యూస్, సూర్యాపేట** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో సోనా బేకరీ & స్వీట్స్ నూతన బ్రాంచ్‌ను కీ.శే. తాటికొండ ఉప్పలయ్య స్మృతిగా ఘనంగా ప్రారంభించారు. 40 ఏళ్లుగా పట్టణంలో నాణ్యమైన స్వీట్స్, హోమ్ ఫుడ్స్ అందిస్తూ మంచి పేరు సంపాదించిన సోనా బేకరీ & స్వీట్స్ నూతన శాఖను మధు గురూజీ, ప్రోప్రైటర్ తాటికొండ ఉమాశంకర్ మరియు కుటుంబ సభ్యులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. నాణ్యమైన స్వీట్స్, బేకరీ ఉత్పత్తులు సరసమైన ధరల్లో అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

## సూర్యాపేటలో శ్రీ వేద స్కిన్ అండ్ ఆర్థో హాస్పిటల్ ప్రారంభం




**డైనమిక్ న్యూస్, సూర్యాపేట** జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వేద స్కిన్ అండ్ ఆర్థో హాస్పిటల్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సూర్యాపేట మెడికల్ హబ్‌గా ఎదుగుతోందని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించి హాస్పిటల్ గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందుతున్నాయని తెలిపారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ చిర్ర మహేష్ మాట్లాడుతూ స్కిన్, ఆర్థో విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగార్జున, స్వరూప్ తేజ్, బిక్షపతి, వెంకటరెడ్డి, పరమేష్, స్వాతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ వట్టె జానయ్య యాదవ్



**డైనమిక్ న్యూస్,సూర్యాపేట** మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ పిలుపునిచ్చారు. టీఆర్‌పీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధిని విస్మరించి మోసం చేస్తున్నాయని విమర్శించారు. సూర్యాపేట మున్సిపాలిటీలో అన్ని వర్గాలకు న్యాయం చేసే పార్టీ టీఆర్‌పీ మాత్రమేనని పేర్కొంటూ, ఈసారి కత్తెర గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

